రంజాన్ వేళలు





	ఇఫ్తార్(సోమవారం)	సెహరీ(మంగళవారం)
కర్నూలు	6:34 (సాయంత్రం)	5:01 (ఉదయం)
ఎమ్మిగనూరు	6:31 (సాయంత్రం)	5:13 (ఉదయం)
ఆదోని	6:35 (సాయంత్రం)	5:03 (ఉదయం)



జోహరాపురం బ్రిడ్జి వద్ద అసంపూర్తిగా ఎంఎల్‌డీ శుద్ధి కేంద్రం పనులు

ఆరంభ శూరత్వం..!

- టెండర్లు లేకుండానే శిలాఫలకాలు
- ఎన్నికల వేళ వైసీపీ నాయకుల హడావుడి
- అభివృద్ధి చేసేసినట్లు కలరింగ్
- అంతా ఓట్ల కోసమేనని విమర్శలు

కర్నూలు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. దీంతో కోడ్ అమలులోకి వచ్చింది. ఎన్నికల కోడ్‌ను దృష్టిలో ఉంచుకుని ఓట్ల కోసం ప్రజలను మభ్యపెట్టేందుకు వైసీపీ నాయకులు పడరానిపాట్లు పడ్డారు. అభివృద్ధి చేసేసినట్లు కలరింగ్ ఇచ్చే ప్రయత్నాలూ చేశారు. సరిగ్గా షెడ్యూల్ విడుదలకు ముందు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలతో హడావుడి చేశారు. క్యాన్సర్ చికిత్సకు కీలకమైన లీనియర్ యాక్సిలలేటర్ యంత్రాలు సహా ఒక్క పరికరం, ఫర్నిచర్ లేకుండానే స్టేట్ క్యాన్సర్ యూనిట్‌ను ప్రారంభించారు. పరిపాలన అనుమతులు ఉన్నాయో లేదో..! అధికారులకే తెలియాలి. అలాగే నేషనల్ లా యూనివర్సిటీకి కూడా సీఎం జగనే శంకుస్థాపన చేశారు. సాక్ష్యాత్తు ముఖ్యమంత్రే ప్రజలను మభ్యపెట్టేలా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తుంటే.. వైసీపీ ప్రజాప్రతినిధులు తక్కువ తిన్నారా..! టీడీపీ ప్రభుత్వ హయాంలో మొదలు పెట్టిన పనులకు వైసీపీ నాయకులు శంకుస్థాపనలు చేశారు. జిల్లా అంతటా ఇదే పరిస్థితి. ఐదేళ్లు అభివృద్ధిని పట్టించుకోని సీఎం జగన్, అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చే ముందు అభివృద్ధి చేశామంటూ హడావుడి చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మురుగు నీటి శుద్ధి పనులు పూర్తి చేయకనే..!

నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో గత చంద్రబాబు ప్రభుత్వం హయాంలో రూ.9 కోట్లతో హంద్రీ నదిపై దేవానగర్ వద్ద 2 ఎంఎల్‌డీ ఎస్‌టీపీ, హంద్రీనది-తుంగభద్రలో కలిసే జోహరాపురం బ్రిడ్జి వద్ద 10 ఎంఎల్‌డీ మురుగునీటి శుద్ధి కేంద్రాల (ఎస్‌టీపీ) నిర్మాణం పనులు 2018లో చేపట్టారు. రాంబొట్ల దేవాలయం వద్ద మరో 35 ఎంఎల్‌డీ సామర్థ్యంతో మరో ఎస్‌టీపీ నిర్మాణానికి రూ.79 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక అటకెక్కాయి. 2020లో మరోసారి వైసీపీ ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఏళ్లు గడిచినా పనులు పూర్తి కాలేదు. తాజాగా.. రూ.131.85 కోట్లతో 35.6 ఎంఎల్‌డీ మురుగునీటి శుద్ధి కేంద్రం నిర్మాణం కోసం సీఎం జగన్ శిలాఫలకం ఆవిష్కరించారు. ఐదేళ్లు అసంపూర్తి పనులే పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం ఎన్నికల ముందు మళ్లీ శంకుస్థాపన చేయడం హాస్యాస్పదంగా ఉందని ప్రజలు పెదవి విరుస్తున్నారు. నగరంలో సీసీ రోడ్లు, డ్రైనేజీల పేరిట ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, మేయర్ బీవై రామయ్యలు వైసీపీ సమన్వయకర్త (రాబోయే ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి) ఏఎండీ ఇంతియాజ్ అహ్మద్‌తో కలిసి భూమి పూజలు చేయడం చూసిన జనం ఐదేళ్లు ఎక్కడికి వెళ్లారని ప్రశ్నిస్తున్నారు.



గోనెగండ్ల మండలంలోని11 గ్రామాలకు తాగునీటి సరఫరా చేసే పనులకు 2017 ఏప్రిల్‌లో శంకుస్థాపన చేసిన నాటి ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

లా వర్సిటీకి టెండర్లు లేకుండానే..!

కర్నూలు నగర శివారున జగన్నాథగట్టుపై 150 ఎకరాల విస్తీర్ణంలో జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం (నేషనల్ లా యూనివర్సిటీ) నిర్మాణానికి సీఎం జగన్ శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. రూ.1,011 కోట్లతో నిర్మిస్తున్నామని సీఎం జగన్ వెల్లడించారు. చిత్తశుద్ధితో చేపట్టి ఉంటే అభినందనీయమే. అయితే.. ఎన్నికల షెడ్యూలు వచ్చే సమయంలో గతవారం హడావుడిగా శంకుస్థాపన చేయడం విమర్శలకు తావిస్తోంది. నిధులు మంజూరు, పరిపాలన అనుమతులపై అధికారులు స్పష్టత ఇవ్వడం లేదు. టెండర్ల ప్రక్రియ కూడా మొదలు కాలేదని సమచారం. అంటే.. కేవలం ఎన్నికల్లో ఓటర్లను మభ్యపెట్టేందుకే ఈ అత్యుత్సాహం అనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.



మురుగు నీటి శుద్ధి కేంద్రం నిర్మాణం, సమగ్ర తాగునీటి సరఫరా పథకానికి గత వారం శంకుస్థాపన చేసిన సీఎం జగన్

ఐదేళ్లు కళ్లు మూసుకున్నారా..?

కర్నూలు నగర జనాభా 6 లక్షలు దాటింది. విస్తరిస్తున్న కాలనీలు, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా తాగునీరు అందించే పైపులైన్ వ్యవస్థతోపాటు నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సి ఉంది. గాజులదిన్నె జలాశయం నుంచి పైపులైన్ కోసం రూ.350 కోట్లు, టిడ్కో ఇళ్లు సహా నంద్యాల, నందికొట్కూరు రోడ్డు వైపు విస్తరిస్తున్న వివిధ కాలనీలకు ముచ్చుమర్రి లిఫ్ట్ నుంచి తాగునీరు అందించేలా మరో రూ.500 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. డీపీఆర్ దశలోనే ఎన్నికలు వచ్చాయి. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లుగా పట్టించుకోలేదు. మరో రెండు రోజుల్లో షెడ్యూల్ వస్తుందనగా గత వారం రూ.115 కోట్లతో సమగ్ర నీటి సరఫరా అభివద్ధి పథకం పేరిట సీఎం జగన్ శంకుస్థాపన చేయడం విమర్శలకు తావిస్తోంది. ఇదేనా చిత్తశుద్ధి..? అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

మళ్లీ.. మళ్లీ శంకుస్థాపన!

ఎమ్మిగనూరు నియోజకవర్గం గోనెగండ్ల మండలంలో రూ.19.50 కోట్లతో 14 గ్రామాల సమగ్ర (మల్టీ విలేజెస్) తాగునీటి సరఫరా పథకానికి ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి ఈ నెల 13న శంకుస్థాపన చేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో మండలంలోని గాజులదిన్నె, పుట్టపాశం, కైరవాడి, పెద్దనెలటూరు, చిన్న నెలటూరు, ఎర్రబాడు, ఈరంపల్లి సహా 11 గ్రామాలకు గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి తాగునీరు అందించే సమగ్ర తాగునీటి పథకానికి 2017 ఏప్రిల్‌లో ఆనాటి ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి శంకుస్థాపన చేశారు. ఆయా గ్రామాల్లో ఓహెచ్‌ఆర్ ట్యాంకులు కూడా నిర్మించారు. పైపులైన్ పనులు చేయాల్సి ఉండగా.. 2019లో వచ్చిన ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం వచ్చింది. ఎమ్మిగనూరు ఎమ్మెల్యేగా గెలిచిన ఎర్రకోట ఐదేళ్లు పట్టించుకోలేదు. ఓహెచ్‌ఆర్ ట్యాంకులు అసంపూర్తిగా ఆగిపోయాయి. త్వరలోనే ఎన్నికలు రాబోతుండడంతో ఆయా గ్రామాల్లో ప్రజలు నిలదీస్తారనే భయం. ఓటర్లను మభ్యపెట్టేందుకు వైసీపీ ఇన్‌చార్జి బుట్టా రేణుకతో కలిసి మళ్లీ శంకుస్థాపన చేసి అభాసుపాలయ్యారని స్థానికులు అంటున్నారు. పట్టణంలో కూడా షాడో ఎమ్మెల్యేలుగా వైసీపీ నాయకులు ఎర్రకోట జగన్మోహన్‌రెడ్డి, బుట్టా రేణుకలు కోడ్ అమల్లోకి రాకముందే సీసీ రోడ్లు, డ్రైనేజీలకు భూమి పూజ చేయడం హాస్యాస్పదంగా ఉందని స్థానికులు విమర్శిస్తున్నారు.

ప్రశాంతంగా గ్రూప్-1 పరీక్షలు

కర్నూలు(కలెక్టరేట్), మార్చి 17: జిల్లాలో ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య తెలిపారు. ఆదివారం నగరంలోని సెయింట్ జోసెఫ్ కాలేజీ, ఎ.క్యాంపు మాంటిస్సోరి పాఠశాలలో నిర్వహించిన ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్ష కేంద్రాలను జేసీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గ్రూప్-1 పరీక్షల పేపర్-1, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పేపర్-2 పరీక్షలు నిర్వహించామని తెలిపారు. జిల్లాలో 31 పరీక్ష కేంద్రాల్లో గ్రూప్-1 పరీక్షలు నిర్వహించామని చెప్పారు. పేపర్-1 పరీక్షకు 11,384 మంది అభ్యర్థులకు గానూ, 7,340 మంది అభ్యర్థులు, పేపర్-2 పరీక్షలకు 11,384 మందికి గానూ, 286 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారని తెలిపారు. పేపర్-1 పరీక్షకు 64.48 శాతం అభ్యర్థులు, పేపర్-2లో 64 శాతం మంది హాజరయ్యారు. జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు ముగిశాయని తెలిపారు.

కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలు పాటించాలి



రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన ఈఆర్‌ఓ భార్గవతేజ

కర్నూలు(కల్చరల్), మార్చి 17: కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను అన్ని రాజకీయ పార్టీలు తప్పక పాటించాలని కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ ఎలక్ట్రోలర్ రిజిస్ట్రేషన్ అధికారి(ఈఆర్‌ఓ), మున్సిపల్ కమిషనర్ ఎ.భార్గవ తేజ అన్నారు. ఆదివారం సాయంత్రం కార్పొరేషన్ కార్యాలయంలోని పాత కౌన్సిల్ హాలులో అన్ని రాజకీయ పార్టీల అధికార ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. కాన్వాసింగ్, ప్రచార వాహనాలు, లౌడ్ స్పీకర్, తాత్కాలిక పార్టీ కార్యాలయాన్ని తెరవడం, కరపత్రాల పంపిణీ, వీడియో వ్యాన్, లౌడ్ స్పీకర్లతో సమావేశం నిర్వహించడం, స్ట్రీట్ కార్నర్ మీటింగ్, ఊరేగింపు, ర్యాలీ, పోస్టర్, హోర్డింగ్, బ్యానర్ జెండాలను ప్రదర్శించడం, వాటికి అనుమతి కోసం ఆన్‌లైన్‌లో ఎలా అప్లయ్ చేసుకోవాలో అవగాహన కల్పించారు. అన్ని రాజకీయ పార్టీలు, ఇండిపెండెంట్ అభ్యర్థులు కచ్చితంగా అనుమతి పొందిన ప్రచార సాధనాలనే ఉపయోగించాలని అన్నారు. సమావేశంలో కార్పొరేషన్ అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ ఏఆర్‌ఓ, కర్నూలు అర్బన్ తహసీల్దార్ మోహన్‌కు మార్, టౌన్‌ప్లానింగ్ ఇన్‌చార్జి డీసీపీ సంధ్య, ఏసీపీ మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ నోడల్ అధికారి రంగస్వామి పాల్గొన్నారు.

వైసీపీలో కొట్లాట

- గ్రామ కంఠం స్థలంపై ఓ వర్గం కన్ను
- అడ్డుకున్న సర్పంచ్ వర్గీయులు
- పోలీస్ స్టేషన్‌కు చేరిన పంచాయితీ

మద్దికెర, మార్చి 17: దాదాపు ఎకరా 87 సెంట్ల ఖాళీ స్థలం అది. ఆ భూమిపై వైసీపీలోని ఓ వర్గ నాయకులు కన్నేశారు. ఆ ప్రాంతంలో సచివాలయం, ఆర్‌బీకే, ప్రభుత్వ కార్యాలయాలు ఉండటంతో ఆ స్థలం విలువైనదిగా భావించి రాత్రికి రాత్రే 25 మందికి పొజిషన్ సర్టిఫికెట్లు తెచ్చుకున్నారు. అయితే.. ఆ స్థలం పంచాయతీదని, ఇక్కడ ఇళ్ల పట్టాలు ఎలా ఇస్తారంటూ సర్పంచు వర్గీయులు అడ్డుకోవడంతో పంచాయితీ పోలీసుస్టేషన్‌కు చేరింది.మండలంలోని ఎం.అగ్రహారం గ్రామంలో సర్వే నెంబర్.261లో ఎకరా 87 సెంట్ల గ్రామ కంఠం స్థలం ఉంది. అయితే మండల కన్వీనర్ గంపల వెంకటేశ్వర్లు రెవెన్యూ అధికారులను మభ్యపెట్టి 28 మందికి పొజిషన్ సర్టిఫికెట్లు తెచ్చుకున్నాడు. సర్పంచు బురుజుల విజయుడుకు తెలియకుండా రెండు నెలల కిందటే వాటిని పంపిణీ చేశారు. ఆ తరువాత ఎవరికీ స్థలాలు కూడా చూపించ లేదు. ఈ క్రమంలోనే ఈ నెల 15వ తేదీన మండల కన్వీనర్ గంపల వెంకటేశ్వర్లు వర్గీయులు ఆ స్థలంలో కొలతలు వేసి హద్దులు వేయాలని వెళ్లారు. విషయం తెలుసుకున్న సర్పంచు విజయుడు వర్గీయులు అడ్డు తగిలారు. దీంతో వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో హద్దులు వేసే ప్రక్రియ ఆగిపోయింది. ఈ క్రమంలోనే సర్పంచ్ బురుజుల విజయుడు, పంచాయతీ కార్యదర్శి కలిసి మద్దికెర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గంపల వెంకటేశ్వర్లుకు చెందిన కుమ్మెటి గోపాల్, గంపల లక్ష్మన్నలు దౌర్జన్యంగా గ్రామ కంఠ స్థలం ఆక్రమించాలని చూస్తున్నారని ఎస్‌ఐ రమేష్‌బాబు దృష్టికి తెచ్చారు. ఆ స్థలానికి సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేయాలని కోరారు.



పట్టాలు ఇచ్చిన పంచాయతీ స్థలం ఇదే

కనపడ లేదా..?

- కోడ్ అమల్లోకి వచ్చినా తొలగించని ఫ్లెక్సీలు
- చోద్యం చూస్తున్న ఎన్నికల అధికారులు



కర్నూలు నగరం రాజ్ విహార్ సర్కిల్ దగ్గర ఆదివారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో జగన్ ఫొటోతో సిద్ధం భారీ హోల్డింగ్



కోడుమూరులో తొలగించని సీఎం జగన్, వైసీపీ అభ్యర్థి ఆదిమూలపు సతీశ్ ఫ్లెక్సీ



కర్నూలు నగరం మెడికల్ కాలేజీ హస్టల్ ప్రహరీపై ఏర్పాటు చేసిన జగన్ ఫొటోతో సిద్ధం భారీ ఫ్లెక్సీ

కర్నూలు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా హోర్డింగ్స్ మాత్రం అలాగే దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాల్లో రాజకీయ ప్రకటనలతో ఉన్న ఫ్లెక్సీలు, పోస్టర్లు, భారీ హోర్డింగ్స్, కటౌట్లు ఆదివారం సాయంత్ర 3 గంటల్లోగా తొలగించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్‌కుమార్ మీనా స్పష్టమైన ఆదేశాలు ఉన్నా జిల్లాలో మాత్రం అమలు చేయలేదు. కర్నూలు నగరంలోని శ్రీకృష్ణదేవరాయల సర్కిల్, రాజ్ విహార్ సర్కిల్, మెడికల్ కాలేజీ హాస్టల్ గోడలపై సీఎం జగన్ ఫొటోతో ఉన్న 'సిద్ధం' ఫ్లెక్సీలు, భారీ హోర్డింగులు తొలగించలేదు. నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవ్ తేజ కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా ఉన్నారు. ఇక్కడే కోడ్ పూర్తిస్థాయిలో అమలు కాకపోవడం విమర్శలకు తావిస్తోంది. కోడుమూరు నియోజకవర్గంలో పలు గ్రామాల్లో వైసీపీ నాయకుల ఫ్లెక్సీలు దర్శనం ఇస్తున్నాయి. రైతు భరోసా కేంద్రాలపై సీఎం జగన్ ఫొటోతో ఉన్న నవరత్నాలు లోగో కనిపించకుండా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాల్లో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, పీహెచ్‌సీపై సీఎం జగన్ ఫొటోతో ఉన్న లోగులు దర్శనం ఇస్తున్నాయి. దివంగత రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయలేదు. ఇప్పటికైనా జిల్లా ఎన్నికల అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలిన పలువురు కోరుతున్నారు.



కర్నూలు నగరం రాజ్ విహార్ సర్కిల్ దగ్గర తొలగించని సిద్ధం భారీ హోల్డింగ్




కర్నూలు నగరం శ్రీకృష్ణదేవరాయ సర్కిల్ దగ్గర ఆదివారం రాత్రి 7.15 గంటల సమయంలో కూడా తొలగించని సిద్ధం భారీ హోల్డింగ్

ఆల్ ది బెస్ట్

- పది పరీక్షలకు సర్వం సిద్ధం..
- జంబ్లింగ్ విధానంలో ఇన్విజిలేటర్ల కేటాయింపు
- జిల్లాలో మొత్తం 37,801 మంది విద్యార్థులు
- 162 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు





కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 17: జిల్లాలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ తెలిపారు. ఆదివారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఆయన పలు వివరాలను వెల్లడించారు. 18వ తేదీ నుంచి 30వ తేదీ వరకు పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరుగుతాయి. జిల్లా వ్యాప్తంగా 37,801 మంది విద్యార్థులు హాజరవుతారు. ఇందులో రెగ్యులర్ విద్యార్థులు 31,178 మంది కాగా, ప్రైవేటుగా 6,623 మంది పరీక్షలకు హాజరవుతారు. జిల్లా వ్యాప్తంగా 162 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. అలాగే ఈ పరీక్షలు ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకు కొనసాగుతాయి. అలాగే ఓపెన్ స్కూల్ పరీక్షలు మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు జరుగుతాయి. ఓపెన్ స్కూల్ పరీక్షలకు ఆదోని, కర్నూలులో 21 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో పదో తరగతి విద్యార్థులు 1,388 మంది కాగా, ఇంటర్మీడియట్ విద్యార్థులు 2,384 మంది అభ్యర్థులు హాజరవుతారు. ఈసారి అభ్యర్థుల సౌకర్యార్థమై జిల్లా జైల్లో కూడా పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పరీక్షల్లో చూచిరాతలు, మాస్ కాపీయింగ్ జరగకుండా మొత్తం 60 సిట్టింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు చేశారు. గతంలో జరిగిన సంఘటనలు దృష్టిలో ఉంచుకుని ప్రతి ప్రశ్నపత్రం పేజీలో క్యూఆర్ కోడ్ ఇస్తున్నారు. దీనివల్ల ఎవరైనా ఫొటోలు తీసి బయటకు పంపితే.. ఏ సెంటర్ నుంచి ఏ హాల్ నుంచి వచ్చిందో గుర్తించేందుకు అవకాశం ఉంటుంది. విద్యార్థుల కోసం హాల్‌టికెట్ చూపించి ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణం చేయవచ్చు. 8 సమస్యాత్మక పరీక్ష కేంద్రాలను గుర్తించి ఆ కేంద్రాల్లో ఎలాంటి మాస్ కాపీయింగ్ జరగకుండా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. మొత్తంమీద 162 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 162 మంది డిపార్టుమెంట్ ఆఫీసర్లతో పాటు 17 చీఫ్ సెంటర్లకు కస్టోడియన్లను నియమించారు.


తొడగొడుతున్న యువతి..


పల్నాడు జిల్లా బొప్పూడి ప్రజాగళం సభకు హాజరైన జనం


ప్రజాగళం సభలో ప్రసంగిస్తున్న చంద్రబాబు, మోదీ, పవన్


ప్రజాగళం సభకు వస్తున్న అమరావతి మహిళలు



ప్రజాగళం.. ప్రభంజనం

జనం జనం ప్రభంజనం.. బొప్పూడి ప్రజాగళం జనసంద్రమైంది. ఆదివారం భానుడు భగభగ మండిస్తున్నా తగ్గేదిలేదన్నట్లుగా తరలివచ్చిన అశేష జనం హర్షాతిరేకాలతో బొప్పూడి సభా ప్రాంగణం దద్దరిల్లింది. బొప్పూడికి ఇటు చిలకలూరిపేట, అటు మార్టూరు వరకు 16వ నెంబరు జాతీయ రహదారి జనంతో నిండిపోయింది. యువకులు వృద్ధులు, మహిళలు పిల్లలు అన్న తేడా లేకుండా అన్ని వర్గాల వారు కూటమి జెండాలు చేబూని బొప్పూడి వైపు కదలిరావడంతో జాతీయ రహదారిపై జన సునామీ ఆవిష్కృతమైంది. చలో బొప్పూడి అంటూ కార్యకర్తలు, నేతలు, అభిమానులు ఒక ప్రవాహంలా తరలిరావడంతో మధ్యాహ్నాం మూడు గంటలకే సభా ప్రాంగణం మొత్తం జనంతో కిటకిటలాడింది. జనసునామీని చూసిన అధినేతలు ఆనందపరవశులయ్యారు. మోదీ అయితే చంద్రబాబును ప్రత్యేకంగా అభినందించారు. బొప్పూడి వేదికగా త్రిమూర్తులైన ప్రధాని నరేంద్రమోదీ, టీడీపీ, జనసేన అధి నేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఎన్నికల శంఖారావం పూరించారు. అభివృద్ధి లేక అప్పులు.. దోపిడీ దాష్టీకాలు.. అవినీతి అప్రజాస్వామిక పాలనను అంతం పలకాలని నేతలు పిలిపిచ్చారు. జెండాలు వేరైనా అజెండా ఒకటేనని.. అభివృద్ధి, సంక్షేమం, ప్రజాస్వామ్య పరిరక్షణ కావాలంటే కూటమికి ఓటేసి ఆశలు, ఆకాంక్షలు, సాకారం చేసుకోవాలని సందేశమిచ్చారు.

- చిలకలూరిపేట




ప్రజాగళం సభలో మూడు పార్టీల అభిమానులు


ఉత్సాహంగా యువతులు..


బాబు,పవన్, పురంధేశ్వరి అభివాదం...


మోదీతో బాబు మాటామంతీ..


జానపదుల నృత్యాలు..


మహిళలు, కార్యకర్తల ఉత్సాహం..





స్పందన రద్దు

కర్నూలు(కలెక్టరేట్), మార్చి 17: కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడం వల్ల స్పందన కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ డా.జి.సృజన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలో డివిజన్ స్థాయిలో, మున్సిపాలిటీ పరిధిలో, మండల స్థాయిలో కూడా స్పందన కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నామని చెప్పారు.

గ్రూప్-1 పరీక్ష కేంద్రాల తనిఖీ


నంద్యాలలో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

నంద్యాల క్రైం, మార్చి 17: గ్రూప్-1 పరీక్ష కేంద్రాల వద్ద ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి నేతృత్వంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. నంద్యాల పట్టణంలో ఏర్పాటు చేసిన గ్రూప్-1 పరీక్షా కేంద్రాలైన నేషనల్ డిగ్రీ కాలేజీ, రామకృష్ణ పీజీ కాలేజీ, గుడ్‌షెపర్డ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ తదితర కేంద్రాలను ఆదివారం ఎస్పీ తనిఖీ చేశారు. అనంతరం ఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ గ్రూప్-1 రాత పరీక్షలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా అన్ని కేంద్రాలవద్ద పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని చెప్పారు. అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి వారి నుంచి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు స్వాధీనం చేసుకున్న అనంతరమే కేంద్రాలలోకి అనుమతించా మని చెప్పారు. పరీక్ష కేంద్రాల వద్ద 144వ సెక్షన్ అమలు చేశామన్నారు. పరీక్ష కేంద్రాల చుట్టుపక్కల ఉండే జిరాక్స్ సెంటర్లను మూసివేయించామని తెలిపారు. పరీక్ష పూర్తయ్యేవరకు పరీక్షా కేంద్రాల సిబ్బంది, పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించామని చెప్పారు. గ్రూప్-1 పరీక్షల సందర్భంగా ఎవరైనా అక్రమాలకు పాల్పడినట్లు తేలితే అలాంటివారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.

ఉన్నత విద్యా మండలి చైర్మన్‌పై చర్యలు తీసుకోవాలి

- కోడ్ వచ్చినా వెబ్‌సైట్‌లో సీఎం, మంత్రుల ఫొటోలా..?
- రాయలసీమ విద్యార్థి, యువజన సంఘాల జేఏసీ చైర్మన్

కర్నూలు(అర్బన్), మార్చి 17: కేంద్ర ఎన్నికల కోడ్ అమలులో ఉండగా ఉన్నత విద్యామండలి వెబ్‌సైట్‌లో సీఎం, మంత్రులు ఫొటోలను అలాగే కొనసాగిస్తున్న చైర్మన్ హేమచంద్రారెడ్డిపై చర్యలు తీసుకోవాలని రాయలసీమ విద్యార్థి, యువజన సంఘాల జేఏసీ చైర్మన్ టీ శ్రీరాములు డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషన్ తక్షణమే వెబ్‌సైట్‌లో, ప్రభుత్వ కార్యాలయాల్లో రాజకీయ నాయకుల ఫొటోలను తొలగించాలని ఆదేశాలు ఉన్నప్పటికీ తుంగలో తొక్కారని మండి పడ్డారు.ఉన్నత విద్యామండలి చైర్మన్ వైసీపీకి ఏజెంట్‌లాగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కోడ్ అమలులో ఉండగా వైసీపీకి నుకూలంగా వీడియోలను విడుదల చేయడం ఎన్నికల కమిషన్ నిబంధనలకు విరుద్ధం అన్నారు. చైర్మన్‌పై ఉన్న విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి శ్యామాలరావు స్పందించకపోవడం దారుణమన్నారు. తక్షణమే హేమచంద్రారెడ్డిపై కఠిన చర్యలు తీసుకోని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అదేవిధంగా కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

ఉత్తమ సేవలకు గుర్తింపు

- పరిమళ ప్రశస్తి-2024 అవార్డుల ప్రదానం
- అవార్డు అందుకున్న ఐటీ నిపుణుడు భానుశంకర్

మంత్రాలయం, మార్చి 17: వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన పలువురికి పరిమళ ప్రశస్తి-2024 అవార్డులను శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆదివారం రాత్రి అందజేశారు. మంత్రాలయం గురు రాఘవేంద్రస్వామి మఠం యోగీంద్ర కళా మండపంలో పరిమళ ప్రశస్తి అవార్డులను పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ప్రదానం చేశారు. సామాజిక సేవలు, ఐటీ రంగంలో కురువ భానుశంకర్ విశేష కృషి చేశారు. అదేవిధంగా కేంద్ర మంత్రిత్వ శాఖ, హర్యాణా రాష్ట్ర గవర్నర్ సలహాదారునిగా సేవలందిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన చేసిన సేవలను బెంగళూరుకు చెందిన గురుదత్తు కమిటీ గుర్తించింది. అందులో భాగంగానే ఆదివారం రాత్రి యోగీంద్ర కళామండపంలో పరిమళ ప్రశస్తి-2024 అవార్డును ఆయనకు పీఠాధిపతి అందజేశారు. అవార్డుతో పాటు రాఘవేంద్రస్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫలపుష్ప మంత్రాక్షింతలు, పరిమళ ప్రసాదం ఇచ్చి పీఠాధిపతి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కర్ణాటక సినీ నటుడు రమేష్ అరవింద, మఠం ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషి, శ్రీపతాచార్, ఐపీ నరసింహమూర్తి, అనంతపురాణిక్, డీఎం ఆనందరావు, ఈఈ సురేష్ కోనాపూర్, ఏఈ బద్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.


ఐటీ నిపుణుడు కురువ భానుశంకర్‌కు పరిమళ ప్రశస్తి అవార్డును ప్రదానం చేస్తున్న పీఠాధిపతి

22 నుంచి గోరంట్ల మాధవుడి తిరుణాల

- 26న అర్ధరాత్రి కల్యాణం
- 30న శ్రీవారి రథోత్సవం

కోడుమూరు(రూరల్), మార్చి 17: మండలంలోని గోరంట్ల లక్ష్మీమాధవ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 22వ తేదీ నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ ఈవో గుర్రెడ్డి, చైర్మన్ అరవ నారాయణ తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ ఈ వేడుకలు 11 రోజుల పాటు జరుగుతాయన్నారు. ఈనెల 22న ఉత్సవాలకు అంకురార్పణ, రక్షాబంధనం, 23న ధ్వజారోహణం, భేరి పూజ, సింహోత్సవం, 24న శేషోత్సవం, 25న హనుమంతోత్సవం, 26న శ్రీవారి కల్యాణం, గరుడోత్సవం (అర్ధరాత్రి అనంతరం), 27న గజోత్సవం, 28న శిఖికోత్సవం, 29న రథారోహణం, 30న శ్రీవారి రథోత్సవం, 31న పారువేట ఏప్రిల్ 1న చక్రస్నానం, వసంతోత్సవం, కంకణ విసర్జనతో ఉత్సవాలకు ముగింపు పలకనున్నట్లు తెలిపారు. ఇక్కడ వ్యవసాయ సామగ్రితోపాటు ఎద్దుల విక్రయాలు జరుగుతాయి. ఈప్రాంతంలో రైతుల తిరుణాలగా పిలుచుకుంటారు.


శ్రీదేవి భూదేవి సహిత లక్ష్మీమాధవస్వామి

నాగమ్మ హత్య కేసులో మరో ఇద్దరు అనుమానితులు

గోనెగండ్ల, మార్చి 17: గోనెగండ్ల మండలం పెద్దమరివీడు గ్రామంలో కురువ నాగమ్మను మనవడు హత్య చేసి ఆమె పైన ఉన్న బంగారం దొంగలించి ఇంటి ఆవరణలోనే శవాన్ని పూడ్చి వేసి సెల్‌ఫోన్ కొనుకున్న సంఘటన పాఠకులకు విదితమే. అయితే కురువ వెంకటేష్ అనే యువకుడే నాగమ్మను హత్య చేసి రాత్రి ఇంటి అవరణం నందే గుంత తవ్వి పూడ్చడం ఒక్కడికే సాధ్యమయ్యే పనేనా అనే అనుమానాలు గ్రామంలో వ్యక్త మవుతున్నాయి. వెంకటేష్‌తోపాటు గ్రామంలో మరికొందరిని విచారించడంతో మరో ఇద్దరి యువకులపై అనుమానాలు వచ్చాయి. దీంతో హత్య చేశానని పోలీసులు ముందు ఒప్పుకున్న వెంకటేష్‌తోపాటు ఆ యువకులను కూడా పోలీసులు విచారణ చేస్తున్నట్లు తెలిసింది. ఈ విషయంపై సీఐ రామకృష్ణయ్య మాట్లాడుతూ అనుమానం రావడంతో విచారణ చేస్తున్నామని, పూర్తి విషయం విచారణలో తెలియాల్సి ఉందన్నారు.


నాగమ్మ(ఫైల్)

వినూత్న ఆలోచన...

చీరలతో బొప్పాయి పండ్లకు రక్షణ



రుద్రవరం, మార్చి 17: మండలంలోని తువ్వపల్లె గ్రామానికి చెందిన రైతు ఇమాంఖాసీం రెడ్డిపల్లెమిట్ట సమీపంలో ఐదెకరాల బొప్పాయి తోట సాగు చేశారు. ఎండ వేడిమి నుంచి బొప్పాయిపండ్లను కాపాడుకునేందుకు ప్రతి చెట్టుకు ఒక చీరను ఏర్పాటు చేశాడు. సాయంత్రం పడమటి నుంచి ఎండ తగలకుండా పడమటి దిశన ప్రతి చెట్టుకు ఒక చీర చుట్టాడు. ఇలా ఏర్పాటు చేయడంతో బొప్పాయి పండ్లకు ఎండనుంచి రక్షణ ఉంటుందంటున్నాడు రైతు ఇమాంఖాసీం. సుమారు ఐదువేల చెట్లకు ఇలా చీరలు చుట్టినట్లు తెలిపాడు.



చికిత్స పొందుతూ రైతు ఆత్మహత్య

క్రిష్ణగిరి, మార్చి 17: మండలంలోని లాలుమాన్ పల్లె గ్రామానికి చెందిన రైతు షేక్ అల్లాబకాష్ (42) చికిత్స పొందుతూ ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి వివరాల మేరకు.. షేక్ అల్లాబకాష్ ప్రతి ఏటా పంటల సాగు కోసం అప్పులు చేశాడు. ఈ సంవత్సరం కూడా పంటల సాగు కోసం అప్పులు చేసి వేరుశనగ, కంది, ఆముదం పంటలను సాగు చేశాడు. రుణదాతల నుంచి ఒత్తిళ్ల అధికం కావడంతో మనస్తాపానికి గురై మామిడి తోటలో పురుగుమందు తాగాడు. మెరుగైన వైద్య చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. భార్య షేక్ హలీమ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

టీడీపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధం

» కర్నూలు అభ్యర్థి టీజీ భరత్
» పార్టీలో చేరిన వైసీపీకి చెందిన యువకులు

కర్నూలు(అర్బన్), మార్చి 17: తెలుగుదేశం పార్టీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. ఆదివారం మౌర్యఇన్‌లోని టీజీ భరత్ కార్యాలయంలో నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన యువకులు, మహిళలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలులోని వాడవాడలా టీడీపీ బలోపేతమైందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో కరెంట్ చార్జీలు, మున్సిపల్ పన్నులు, నిత్యావసర సరుకుల ధరలు పెరిగాయన్నారు. ప్రజల ఆదాయం మాత్రం పెరగలేదని, కష్టాల్లో ఉన్న రాష్ట్రాన్ని గట్టెక్కించాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి అవ్వాల్సిందేనని అన్నారు. వైసీపీ నాయకులు వందల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి స్మార్ట్ సిటీ చేశామని గొప్పలు చెప్పుకుంటున్నారని, నిజంగా స్మార్ట్ సిటీ అయి ఉంటే ప్రజలకు సమస్యలు ఎలా ఉంటాయని ప్రశ్నించారు. నగరంలోని ఏ వీధికి వెళ్లినా సమస్యలే కనిపిస్తున్నాయన్నారు.

● తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్కీటూ గోపి ఆధ్వర్యంలో 50 వార్డుకు చెందిన బబ్లూ, నరసింహులు, నవీన్, 51వ వార్డులకు చెందిన లక్ష్మణ్. కిరణ్‌ల ఆధ్వర్యంలో యువకులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు.

● టీడీపీ నేత ఊట్ల రమేష్ బాబు ఆధ్వర్యంలో కుమ్మరిగేరికి చెందిన షేక్ మున్నాతోపాటు ఆయన బృందం టీడీపీలో చేరారు.

● టీడీపీ నేత కలీం ఆధ్వర్యంలో 7వ వార్డుకు చెందిన వైసీపీ నాయకులు ఇంతియాజ్, హజీ, మౌలాలీ, షాషా, ఫైరోజ్, రాజా, నయిం. పరూఖ్, అబ్దుల్లాతోపాటు మరికొంత మంది యువకులు టీడీపీలో చేరారు.

● చేపల రమేష్ ఆధ్వర్యంలో 8వ వార్డు పెద్దపడఖానాకు చెందిన డాక్టర్ శేషన్నతోపాటు స్థానికులు టీడీపీలో పార్టీలో చేరారు.



టీడీపీలో చేరిన వారితో టీజీ భరత్

● టీడీపీ నాయకుడు మోహన్ ఆధ్వర్యంలో నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ల్యాబ్ టెక్నీషియన్లు టీజీ భరత్‌కు మద్దతు తెలిపి పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారంతా కష్టపడి తెలుగుదేశం పార్టీని గెలిపించుకుంటామని తెలిపారు.

టీజీ భరత్‌కు ఉప్పర సంఘం నాయకుల మద్దతు: కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్‌కు ఉప్పర సంఘం నాయకులు మద్దతు తెలిపారు. ఆదివారం నగరంలోని మౌర్యఇన్‌లోని ఆయన కార్యాలయంలో టీజీ భరత్‌ను కలిసి మద్దతు పలికారు. టీడీపీని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నామని, రానున్న 50 రోజుల పాటు ప్రజల్లోకి వెళ్లి చైతన్యం తెస్తామని అన్నారు. టీజీ భరత్‌ను కలిసిన వారిలో నగర ఆధ్యక్షుడు రాంప్రసాద్, మాజీ జిల్లా అధ్యక్షుడు కోడుమూరు రాముడు లలితమ్మ, యాసీ వెంకటేష్, రాజేష్, వెంకటరాముడు, ఓబులేసు, సత్యన్న, వెంకట్, ఆనంద్, సంధ్యారాణి, చక్రవర్తి, సునీల్, అయ్యాన్న ఉన్నారు.

ఎన్నికల కోడ్ వచ్చినా..

» ఆసుపత్రిలో తొలగని మంత్రులు, ఎమ్మెల్యేల ఫొటోలు







కర్నూలు ఆసుపత్రి ఓపీ చీటిలో ఉన్న ముఖ్యమంత్రి ఫొటో, ఆసుపత్రిలో ఔషధాలు ఇచ్చే కేంద్రంలో పోస్టర్‌లో తొలగని ముఖ్యమంత్రి, వైద్యఆరోగ్య శాఖ మంత్రి ఫొటోలు, ఓపీ సేవల పోస్టర్‌లో ఉన్న ముఖ్యమంత్రి, మంత్రి, ఎమ్మెల్యే ఫొటోలు

కర్నూలు(హాస్పిటల్), మార్చి 17: ఎన్నికల కోడ్ కూసింది. కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. అయితే కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో మాత్రం ఎన్నికల కోడ్ ఉన్న ఎక్కడా ఆసుపత్రిలో పోస్టర్లు, హోర్డింగ్‌లలో ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేల ఫొటోలు తొలగించలేదు. కొడ్ అమలులోనికి రావడంతో కలెక్టరేట్ ఎదుట ఉన్న ఎన్టీఆర్ సర్కిల్‌లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి తెల్లటి వస్త్రం చు ట్టారు. కానీ ఆసుపత్రిలోని ఓపీ సేవల పోస్టర్‌లో ముఖ్యమంత్రి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, ఎమ్మెల్యే పేర్లను ఆదివారం కూడా తొలగించకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇక మందులు ఇచ్చే ఔషధశాల ఫ్లెక్సీలో ముఖ్యమంత్రి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి పేర్లు అలాగే ఉన్నాయి. ఇక రోగులకు ఇచ్చే ఓపీ చీటిల్లో కూడా ముఖ్యమంత్రి పేరు ఉండటం విశేషం.

టీడీపీ కూటమిని గెలిపించుకుందాం

మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత


టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేస్తున్న గౌరు చరిత

కల్లూరు, మార్చి 17: రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగిస్తున్న వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని గెలిపించుకుందామని మాజీ ఎమ్మెల్యే, పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరిత పిలుపునిచ్చారు. ఆదివారం కల్లూరు అర్బన్ 32వ వార్డు ముజఫర్‌నగర్‌లోని టైలర్స్ కాలనీలో ఆమె శంఖారావం, సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా గౌరు చరిత మాట్లాడుతూ జగన్‌రెడ్డి ప్రజావ్యతిరేక పాలనపై ప్రజలు ఆగ్రహంగా ఉన్నారని, రానున్న ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి కూటమి గెలుపునకు కృషి చేయాలని గౌరుచరిత పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి పీయూ మాదన్న, వార్డు నాయకులు నాగరాజు, సోమన్న, బందేనవాజ్, కేవీ శేఖర్, రవిప్రకాష్‌రెడ్డి, కోటేష్ గౌడ్, జనసేన నాయకులు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు ప్రశాంతంగా జీవించాలి: సీఐ


పోలకల్లులో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

సి.బెళగల్, మార్చి 17: గ్రామాల్లోని ప్రజలు ప్రశాంతంగా జీవించాలని కోడుమూరు సీఐ మన్సూరుద్దీన్ అన్నారు. ఆదివారం మండలంలోని పోలకల్లు, కంబంధహాల్, సిబెళగల్ గ్రామాలలో ఎస్పీ ఆదేశాల మేరకు కర్నూలు ఎస్‌డీపీవో విజయశేఖర్ ఆధ్వర్యంలో ఎస్ఎస్‌బీ సెంట్రల్ ఫోర్సు అధికారి నవీన్‌దాసు, సి.బెళగల్ ఎస్ఐ తిమ్మారెడ్డి, కోడుమూరు, గూడూరు, సి.బెళగల్ పోలీసులు కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా కోడుమూరు సీఐ మన్సూరుద్దీన్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా మండలంలోని గ్రామాల్లో ముందస్తుగా సాయుధ బలగాలతో కవాతు నిర్వహించామన్నారు.

ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి


మాట్లాడుతున్న ఈఆర్ఓ భార్గవతేజ

కర్నూలు(న్యూసిటీ), మార్చి 17: సార్వత్రిక ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ ఎలక్ట్రోలర్ రిజిస్ట్రేషన్ అధికారి(ఈఆర్ఓ) ఏ.భార్గవతేజ సూచించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని పాతకౌన్సిల్ హాలులో ఆదివారం ఎన్నికల నిబంధనల ప్రకారం ఫార్మాట్ ఫిల్లింగ్, ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టం, సీవిజల్ యాప్‌లపై అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్, స్టాటిక్ సర్వేయిలెన్స్, ఫ్లైయింగ్ స్క్వాడ్ టీంలకు విధి విధానాలను వివరించారు. అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

● రాయలసీమ యూనివర్సిటీ క్యాంపస్‌లోని ఎన్నికల స్ట్రాంగ్ రూమ్‌ను ఈఆర్ఓ ఏ.భార్గవతేజ కార్పొరేషన్, టిడ్కో, ఆర్అండ్‌బీ, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి తనిఖీ చేశారు.

ప్రజాగళం సభలో బొగ్గుల దస్తగిరి

కర్నూలు(రూరల్), మార్చి 17: గుంటూరు జిల్లా చిలకలూరిపేట బొప్పూడి వద్ద ఆదివారం జరిగిన ప్రజాగళం సభకు కోడుమూరు టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి హాజరయ్యారు. ఈ సభకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, టీడీపీ ఆధినేత నారా చంద్రబాబునాయుడు, జనసేన ఆధినేత పవన్‌కళ్యాణ్, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈసందర్భంగా దస్తగిరి మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తులో భాగంగా తొలిసారిగా జరిగిన సభకు రాష్ట్రం నలుమూలల నుంచి జనం భారీ ఎత్తున తరలివచ్చారన్నారు. రాష్ట్రంలో వచ్చేది టీడీపీయేనని ఇప్పటికే ప్రజలు సంకేతాలు ఇస్తున్నారన్నారు. ఆయన వెంట మండల మాజీ కన్వీనర్ బుర్ర వెంకటేష్, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు భాస్కర్, శంకర్, రేమట వెంకటేష్, రామాంజి, ఐటీడీపీ కృష్ణనాయుడు, బాషా, టీడీపీ నాయకులు ఉన్నారు.

ఉపాధ్యాయుల అక్రమ బదిలీలు రద్దు చేయాలి



మాట్లాడుతున్న డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కరెకృష్ణ

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 17: ఉపాధ్యాయ అక్రమ బదిలీలను రద్దు చేయాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు కరెకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి గట్టు తిమ్మప్ప, రాష్ట్ర కార్యదర్శి గోట్ల చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక డీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం గురించి అన్ని రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలో పొందుపరచాలని కోరారు. గత ఏడాది పదో తరగతి మూల్యాంకనం రెమ్యునరేషన్ వెంటనే విడుదల చేయాలని, 58 సంవత్సరాలు పైబడిన వారిని, ఆరోగ్య సమస్యలున్న వారికి పది పరీక్షల డ్యూటీలలో మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా డీటీఎఫ్ నాయకులు రామన్న, వెంకట్రాముడు, పాటిల్ ఈశ్వర్ రెడ్డి, వెంకటేశప్ప, నాగరాజుగౌడు, గంగాధర్, చంద్రశేఖరయ్య పాల్గొన్నారు.

స్కానింగ్ కోసం అవస్థలు


న్యూడయోగ్నస్టిక్ బ్లాక్ నుంచి తిరిగి వస్తున్న రోగి, అతన్ని వీల్‌చైర్‌లో తీసుకుని వస్తున్న భార్య

కర్నూలు(హాస్పిటల్), మార్చి 17: ఈ ఫోటోలో ఉన్న రోగి పేరు వెంకట్రాముడు ఏఎం సీ వార్డులో అనారోగ్యంతో చేరారు. ఆదివారం ఏఎంసీ వైద్యులు అల్ట్రాసౌండు స్కానింగ్ రాసి ఇవ్వ గా రోగిని స్ట్రెచ్చర్‌పై పరీక్షకు తీ సుకెళ్లడానికి సిబ్బంది రాకపోవ డంతో భార్య వీల్‌చైర్‌పై న్యూడ యోగ్నస్టిక్ బ్లాక్‌కు తీసుకెళ్లింది. అక్కడ స్కానింగ్ కోసం వెళ్లగా రేడియాలజీ విభాగం నెంబర్. 18కు వెళ్లాలని సూచించారు. ఇలా ఇక్కడ, అక్కడ అంటూ తిప్పుతున్నారని రోగి భార్య ఆవేదన వ్యక్తం చేశారు.

కేఎంసీ స్పందన రద్దు

కర్నూలు(న్యూసిటి), మార్చి 17: సార్వత్రిక ఎన్నికల కోడ్ శనివారం నుంచి అమలులో ఉన్నం దున ప్రతి సోమవారం జరిగే స్పందన కార్యక్రమాన్ని సోమవారం నుంచి తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు కమిషనర్ భార్గవ్‌తేజ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు.

టీడీపీ గెలుపునకు కృషి చేయాలి


జూనియర్ ఎన్టీఆర్ అభిమానులతో టీజీ భరత్

కర్నూలు(అర్బన్), మార్చి 17: రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపునకు జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు కృషి చేయాలని కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. ఆదివారం నగరంలోని మౌర్యఇన్‌లో తెలుగు యువత పార్లమెంట్ సెక్రటరీ మోతీలాల్ ఆధ్వర్యంలో జూనియర్ ఎన్టీఆర్ అభిమానులతో టీజీ భరత్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఎన్టీఆర్ దృష్టంతా సినిమాలపైనే ఉందన్నారు. టీడీపీని వదిలేది లేదని గతంలో ఎన్టీఆర్ చెప్పినట్లు గుర్తు చేశారు. టీడీపీ అధికారంలోకి వస్తే యువతకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. 20 లక్షలు ఉద్యోగాలు కల్పించేందుకు చంద్రబాబు విజన్‌తో పని చేస్తారన్నారు ఈ కార్యక్రమంలో జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ఓర్వకల్లు, మార్చి 17: మండలంలోని హుశేనాపురం గ్రామానికి చెందిన పేరుమాళ్ల సునిత(34) కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. ఎస్ఐ రాజారెడ్డి తెలిపిన వివరాలివి.. ఈ నెల 16న దీర్ఘకాలంగా ఉన్న గుండెనొప్పి భరించలేక ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగింది. అపస్మారక స్థితిలో పడి వున్న ఆమెను చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతు రాలి భర్త మురళీ మోహన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కోడుమూరులో టీడీపీ విజయం తథ్యం

కర్నూలు ఎంపీ సంజీవకుమార్


విష్ణువర్ధన్‌రెడ్డిని కలిసిన కర్నూలు ఎంపీ సంజీవకుమార్

కర్నూలు (రూరల్), మార్చి 17: కోడుమూరు నియోజకవర్గంలో టీడీపీ విజయం తథ్యమని కర్నూలు ఎంపీ, టీడీపీ నాయకుడు డాక్టర్ సంజీవకుమార్ అన్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి ఆహ్వానం మేరకు ఆదివారం ఆయన ఇంటికి ఎంపీ వచ్చారు. ఈసందర్భంగా సంజీవకుమార్ విష్ణుకు శాలువ కప్పి సత్కరించారు. విష్ణు ఇంటికి తొలిసారిగా ఎంపీ రావడంతో ఇద్దరు కలిసి అల్పాహారం చేసిన అనం తరం తాజా రాజకీయాలపై చర్చించారు. కోడుమూరులో అధిక శాతం చేనేత కుటుంబాలు ఉన్నారని అవసరమైతే ప్రచారంలో పాల్గొని టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరిని గెలుపునకు తనవంతు కృషి చేస్తానని ఎంపీ సంజీవ కుమార్ విష్ణుకు సూచించారు. రాష్ట్రంలో టీడీపీ గెలుపు చారిత్రక అవసర మన్నారు. టీడీపీ ఆదినేత చంద్రబాబు తనకు ఎలాంటి బాధ్యతలు అప్పగించిన పార్టీ గెలుపు కోసం కృషి చేస్తానన్నారు.

సారా స్థావరాలపై దాడులు


నాటుసారా బట్టీలను ధ్వంసం చేస్తున్న పోలీసులు

ఓర్వకల్లు, మార్చి 17: మండలంలోని గుమితంతాండ గ్రామంలో ఆదివారం డీఎస్ఈవో ఇన్‌చార్జి అడిషినల్ ఎస్పీ నాగరాజు పర్యవేక్షణలో మండలంలోని గుమితంతాండ గ్రామంలో నాటు సారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. నాటుసారా తయారీకి సిద్ధంగా ఉన్న 3,200 లీటర్ల బెల్లం ఊటను, 35 లీటర్ల సారాను ధ్వంసం చేశారు. సారా తయారీదారులను గుర్తించేందుకు దర్యాప్తు చేస్తున్నామని కర్నూలు సెబ్ ఇన్‌స్పెక్టర్ కేఆర్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఈ దాడుల్లో కర్నూలు సెబ్ సబ్ ఇన్‌స్పెక్టర్లు రేహానాబేగం, మారుతి ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి : శ్రీధర్‌బాబు

కర్నూలు(న్యూసిటీ), మార్చి 17: అఖిల భారత తపాలా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సంఘం పీ-3 రాష్ట్ర కార్యదర్శి శ్రీధర్‌బాబు అన్నారు. రాష్ట్ర పర్యటనలో భాగంగా ఆదివారం కర్నూలు డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తపాలా శాఖ ప్రైవేటీకీకరణకు ఎన్ఎఫ్‌పీఈ-3 అడ్డుగా ఉందనే ఉద్దేశంతోనే ఎలాంటి ఆధారం లేకుండా గుర్తింపు రద్దు చేశారన్నారు. ఈ సమావేశంలో నాయకులు గిరిబాబు, ఈశ్వరయ్య, మహ్మద్‌జానీ, శమంతకరెడ్డి, మాధవి, గాయత్రి, కృష్ణవేణి, స్వరూపారాణి, గరీబ్, గంగాధర్ పాల్గొన్నారు.

డాక్టర్ జయరాం సంతాప సభ

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 17: స్థానిక ప్రీమియర్ జూనియర్ కళాశాలలో ఆదివారం డాక్టర్ జయరాం సంతాప సభ ఎస్ఎల్‌టీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరమణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జయరాం సంఘానికి చేసిన సేవలను పలువురు వక్తలు కొనియాడారు. ఈ సమావేశంలో ఎస్ఎల్‌టీఏ రాష్ట్ర కార్యదర్శి మద్దిలేటి, జిల్లా అధ్యక్షులు తాహేర్ హుసేన్, సంయుక్త కార్యదర్శి ప్రకాష్, జిల్లా గౌరవాధ్యక్షులు యోగేశ్వర్ రెడ్డి, అంకాల్ కొండయ్య, రాష్ట్ర సలహాదారులు బాలన్న పాల్గొన్నారు. అనంతరం జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎస్ఎల్‌టీఏ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా సమీర్, అదనపు కార్యదర్శి మురళీకృష్ణ, ఉపాధ్యక్షులు సురేష్ కుమార్, రామాంజనేయులు, ఆర్థిక కార్యదర్శి అయ్యన్నలను ఎన్నుకున్నారు.

టీడీపీలోకి వర్కూరు వైసీపీ నాయకులు


విష్ణు సమక్షంలో టీడీపీలో చేరిన వర్కూరు వైసీపీ నాయకులు

కర్నూలు(రూరల్), మార్చి 17: కోడుమూరు మండలం వర్కూరు గ్రామానికి చెందిన సచివాలయ కన్వీనర్లు బోయ అయ్యప్ప, దేవదర్శనం, పెద్ద తోటయ్య, అలీబాషాపాటు వార్డు సభ్యులు జాన్, ప్రేమవరం మహేష్‌బాబు, వెంకటరాముడు, ఉప్పరి నరేష్‌లు వైసీపీని వీడారు. వారంతా ఆదివారం కర్నూలులో టీడీపీ సీనియర్ నాయకుడు ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి టీడీపీ కండువా కప్పి విష్ణు పార్టీలోకి ఆహ్వానించారు. వారితోపాటు వర్కూరు చెందిన వైసీపీ కార్యకర్తలు జయన్న, రంగడు, మాద న్న, లక్ష్మన్న, తోట కుమార్, శివశేఖర్, సుంకన్న, ఎల్లప్ప, దాస్, విజయుడు, కోటకొండ ఎర్రన్నతోపాటు మరో వంద మంది కుటుంబాలు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో కర్నూలు పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు కేఈ.మల్లికార్జునగౌడ్ పాల్గొన్నారు.

● కర్నూలు రూరల్ మండలం రేమట గ్రామానికి చెందిన సర్పంచు కురువ వెంకన్న, మాజీ టీడీపీ కన్వీనర్ బోయ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో దాదాపు 50మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. టీడీపీలో చేరిన వారిలో కిరణ్, వినోద్, యూసూఫ్, బాబుబాష, ఖాజా ఉన్నారు.

● సి.బెళగల్, గొల్లలదొడ్డి, చెరువుపల్లె, తిమ్మందొడ్డి, పోలకల్, మారందొడ్డి, కంపాడు, బురాన్‌దొడ్డి, చింతమానుపల్లె గ్రామాలకు చెందిన దాదాపు 350 మంది యువకులు టీడీపీలో చేరారు. యువకులంతా సి.బెళగల్ మండల మాజీ టీడీపీ కన్వీనర్ తిమ్మప్ప, మాజీ ఎంపీటీసీ ధనుంజయ ఆధ్వర్యంలో కర్నూలులో టీడీపీ సీనియర్ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. టీడీపీలో చేరిన వారిలో రామకృష్ణ, వెంకటేశ్వర్లు, చంటి, రమేష్, లింగన్న, అల్లాబకాష్, ఖాజావలి, శేఖర్, మద్ది, రాముడు ఉన్నారు.

● కోడుమూరు టీడీపీ ఎంపీటీసీ-3 సభ్యురాలు చాముండేశ్వరి ఆమె భర్త రవి మరో 60మంది మహిళలతో కలిసి టీడీపీ సీనియర్ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డిని కలిశారు. సార్వత్రిక ఎన్నికల్లో విష్ణు నాయకత్వంలో పనిచేసి, టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరికి సంపూర్ణ మద్దతు తెలిపారు.

● గూడూరు మండలం బూడిదపాడు గ్రామానికి చెందిన మాజీ సర్పంచులు వీరన్న, చిన్న నరసింహులు, మాజీ ఎంపీటీసీ ఏసన్న, టీడీపీ నాయకులు శ్రీను, వెంకటరాముడు, అక్బర్‌బాషా, మధు, ధనుంజయ, మల్లికార్జున, సుంకన్న, యేహాన్, రవితోపాటు మరో 86మంది టీడీపీ సీనియర్ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పూలమాలతో ఘనంగా సత్కరించారు. టీడీపీ నాయకులు గోపాల్‌రెడ్డి, జె.సురేష్ పాల్గొన్నారు.

వైభవంగా రంగనాథుడికి వాహన సేవలు


సింహ వాహనంపై ఊరేగుతున్న రంగనాథ స్వామి

కర్నూలు (కల్చరల్), మార్చి 17: నగర శివారు మామిదాలపాడులోగల గోదా రంగనాథస్వామి వారి దేవస్థానం (గోదాగోకులం)లో కొనసాగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారికి ఉభయ సంధ్యా వేళల్లో సింహ వాహన సేవ, అశ్వ వాహన సేవలు వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా నిత్య కార్యక్రమాలను యథావిధిగా చేపట్టారు. తెల్లవారు జామును ప్రాతఃఆరాధన, అర్చనలు, సేవా కాలం, ధ్వజ కుంభారాధన, హోమము నిర్వహించి స్వామివారికి ప్రసాదాలు నివేదించారు. అనంతరం భక్తులు సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. అష్టాక్షరీ పీఠాధిపతి త్రిదండి అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామీ, త్రిదండి అష్టాక్షరీ బృందావన రామానుజ జీయర్ స్వామీ, ప్రయాగరాజ్ రాఘవ ప్రపన్న జీయర్ స్వామీల నేతృత్వంలో, శ్రీమన్నారాయణాచార్య స్వామి యాజ్ఞికత్వంలో అర్చకులు రమేశ్ భట్టర్, కిరణ్ భట్టర్‌లు శాస్త్రోక్తంగా వేడుకలను నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి చక్రస్నాన క్రతువు నిర్వహించారు. ముగ్గురు పీఠాధిపతుల నేతృత్వంలో వేద పండితులు, ఆలయ అర్చకులు ఈ కార్యక్రమాన్ని చేపట్టి, చక్ర స్నానం అనంతరం భక్తుల శిరస్సులపై ఆ తీర్థాన్ని చల్లి ఆశీర్వచనాలు పలికారు. అలాగే 1008 మంది దంపతులకు స్వామివారి తాంబూలాలు అందజేశారు. కార్యక్రమంలో గోదా గోకులం వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజ గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు, పాలాది సుబ్రహ్మణ్యం, బాలసుధాకర్, భూమా కృష్ణమోహన్, వేముల జనార్ధన్, తల్లం సురేష్, భక్తులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మించాలి


మాట్లాడుతున్న కాలనీవాసులు

కర్నూలు(న్యూసిటీ), మార్చి 17: స్థానిక బళ్లారి చౌరస్తా నుంచి సంతోష్‌నగర్ వరకు జాతీయ రహదారిపై ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిమించాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఇరిగినేని పుల్లారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం కార్యాలయంలో సంతోష్‌నగర్, బాలాజీనగర్ వ్యాపార వాణిజ్య వర్గాలు, వివిద కాలనీలు, అపార్ట్‌మెంటు అసోసియేషన్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారులపై ట్రాఫిక్ పోలీసులను నియమించి రోడ్డు దాటించే అవకాశం కల్పించాలన్నారు. అశాస్త్రీయంగా నిర్మించిన జాతీయ రహదారి వల్ల ప్రతిరోజు వేలాది మంది నరకం అనుభవిస్తున్నారని అన్నారు. కొద్దిదూరంలో రోడ్డు అవతల ఉండే పాఠశాల, దుకాణానికి కూడా రెండుకిలోమీటర్లు తిరిగి రావాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఈసమావేశంలో పెట్రోలు బంకు యజమానుల సంఘం జిల్లా అధ్యక్షుడు జక్కం సురేష్, అపార్ట్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపినాథ్, కార్యదర్శి కృష్ణయ్య, వ్యాపార వాణిజ్య వర్గాల ప్రతినిధులు దుర్గాప్రసాద్‌రెడ్డి, జలీల్ అహ్మద్ పాల్గొన్నారు.

'మనుషులను మార్చే కవిత్వం కావాలి'


కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న కోయి కోటేశ్వరరావు, విల్సన్‌రావు

కర్నూలు(కల్చరల్), మార్చి 17: మనుషులను మార్చే కవిత్వం కావాలని హైదరాబాదు సిటీ కళాశాల తెలుగు శాఖాధిపతి డాక్టర్ కోయి కోటేశ్వరరావు అన్నారు. ఆదివారం నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో సాహితీ స్రవంతి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ కృష్ణా జిల్లాకు చెందిన ప్రముఖ కవి విల్సన్‌రావు కొమ్మవరపు రాసిన 'నాగలి కూడా ఆయుధమే' కవితా సంపుటి పరిచయ సభ జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన కోటేశ్వరరావు మాట్లాడుతూ వైవిధ్యమైన కవిత్వ శిల్పంతో ఈ సంపుటి నిలుస్తుందని, ఇందులోని అన్ని కవితలు సామాన్యుల నుంచి మేధావుల వరకు ఆలోచించే విధంగా రాశారని ప్రశంసించారు. విశిష్ట అతిథి తగుళ్ల గోపాల్ మాట్లాడుతూ విల్సన్‌రావు కవిత్వంలో అనేక కోణాలు ఉన్నాయని, ఇందులో సామాన్యుడి బతుకు చిత్రం ప్రస్ఫుటమవుతుందని అన్నారు. సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ మాట్లాడుతూ నేడు వస్తున్న వచన కవిత్వంలో 'నాగలి కూడా ఆయుధమే' ప్రముఖంగా నిలుస్తుందని అన్నారు. సభాధ్యక్షత వహించిన సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు మాట్లాడుతూ వైవిధ్యంగా వస్తువును దర్శించడంతోపాటూ శిల్పంలో నైపుణ్యాన్ని ప్రదర్శించడం కొంతమందికే సాధ్యమని విల్సన్‌రావు కవికి దక్కుతుందని అన్నారు. రచయిత విల్సన్‌రావు మాట్లాడుతూ కవిత్వంలోని వస్తువు, శిల్పమే కాకుండా వాస్తవికత, సౌందర్యాత్మకత, తాత్వికత, అంతర్లీనంగా దాగి ఉండడమే ఈ కవితా సంపుటి ప్రత్యేకత అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకురాలు మల్లెపోగు వెంకటలక్ష్మమ్మ, సాహితీ స్రవంతి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల చక్రపాణి యాదవ్, విజయుడు, మారుతి, ఏవీ రెడ్డి, డాక్టర్ హరికిషన్ పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘన

● జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల తొలగించని ఫ్లెక్సీలు
● ఆదోని పట్టణ నడిబొడ్డున వైసీపీ బ్యానర్
● సచివాలయాలకు కోడ్ వర్తించదా?

పత్తికొండ, మార్చి 17: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన 24 గంటల్లోగా ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు ప్రాంతాల్లో పార్టీ అధినేతలకు సంబంధించిన ఫ్లెక్సీలు, బోర్డులు, స్టిక్కర్లు ఉండరాదని ఆదేశాలు ఉన్నాయి. అయితే జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఎన్నికల నియమావళిని అనుసరించి ఫ్లెక్సీలు, బోర్డులు తొలగించినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో ఉల్లంఘించారు. పత్తికొండ మార్కెట్ యార్డులో నిర్మించిన వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్ కార్యాలయానికి ముఖ్యమంత్రి జగన్ స్టిక్కర్‌ను అలాగే ఉంచారు. తేరుబజార్‌లో పోచంరెడ్డి సేవాదల్ కార్యాలయంతో పాటు ఆ పక్కనే నిర్మాణంలో ఉన్న వైఎస్సార్ ఆరోగ్య సేవా కేంద్రం, ముఖ్యమంత్రి జగన్ బొమ్మలను అలాగే ఉంచారు. దీనికి తోడు పత్తికొండ పట్టణంలో వివిధ దుకాణాల వద్ద ఏర్పాటు చేసిన మా నమ్మకం నువ్వే జగనన్న హోర్డింగ్‌లను తొలగించకుండా అలాగే వదిలేశారు. పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవి ఇంటి వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు తొలగించలేదు. ఎమ్మెల్యే ఇంటి వద్దనే ఎన్నికల నియమావళి అమలు కాకపోతే.. సామాన్యులు నియమావళిని ఎలా పాటిస్తారని పలువురు బహిరంగంగా ప్రశ్నిస్తున్నారు.

ఆదోని పట్టణ నడిబొడ్డున ఉన్న వైసీపీ బ్యానర్



ఆదోని : ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించడంతో రాష్ట్రవ్యాప్తంగా ఎలక్షన్ కోడ్ అమలులోకి వచ్చింది. కోడ్ కారణంగా నేతలు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలి. ఆదోని పట్టణంలోని పట్టణ నడిబొడ్డున ఉన్న వైసీపీ కార్యాలయానికి యథేచ్ఛగా వైసీపీ బ్యానర్ ఏర్పాటు చేసుకొని ప్రచారం చేస్తోంది. శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చింది. వైసీపీ నాయకులు బ్యానర్ ద్వారా ప్రచార పిచ్చిని భరించలేకపోతున్నామని, ప్రభుత్వమే ఎన్నికల కమిషన్ నిబంధనలు ఉల్లంఘించడం ఎంతవరకు సమంజసం అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

మాధవరం సచివాలయానికి ఎన్నికల కోడ్ వర్తించదా?

మంత్రాలయం: మాధవరం సచివాలయం-1లో నవరత్నాలు తెలిపే జగన్ ఫొటో అలాగే ఉంచారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చి 24 గంటలు దాటినా హైవే రోడ్డుకు, పోలీస్‌స్టేషన్‌కు పక్కనే ఉన్న సచివాలయం బోర్డుపై సీఎం జగన్‌బొమ్మ అలాగే ఉంచడం గమనార్హం.

విగ్రహాలకు ముసుగులు వేయలేదు

కోసిగి : సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఎన్నికల కమిషన్ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటికీ అధికార వైసీపీతో కూడిన సీఎం జగన్ రెడ్డి ఫొటోలు, వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవా వాహనంతో పాటు అలాగే కొత్తగా నిర్మించిన సచివాలయాలపైన సీఎం జగన్ నవరత్నాలతో కూడిన ఫొటోలు, స్టిక్కర్లుకు ముసుగు వేయలేదు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి అధికార పార్టీకి సంబంధించిన అన్ని ప్రచార ఫ్లెక్సీలను, ఫొటోలను, స్టిక్కర్లను తొలగించాల్సి ఉండగా.. కోసిగిలో మాత్రం అధికారులు పెడచెవిన పెట్టారు.



కోసిగి వైఎస్సార్ సంచార పశు సేవా వాహనంపై సీఎం జగన్ బొమ్మ

ప్రభుత్వ భవనాలకు తొలగని రాజకీయ ముఖాలు

వెల్దుర్తి : వెల్దుర్తి పట్టణంలో రైతు భరోసా కేంద్రం భవనం, పంచాయతీ కార్యాలయ ఆవరణలో హోర్డింగ్, సుజల స్రవంతి మంచి నీరు సరఫరా చేసే కేంద్రాల మీద ఏర్పాటుచేసిన ప్రజాప్రతినిధుల ఫ్లెక్సీలు తొలగించలేదు.





పత్తికొండలో వైఎస్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్ కార్యాలయం వద్ద సీఎం జగన్ స్టిక్కర్, వెల్దుర్తిలోని రైతు భరోసా కేంద్రంమీద ఉన్న సీఎం జగన్‌బొమ్మ, మద్దికెర పబ్లిక్ స్థలాల్లో తొలగించని రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు

కష్టాల్లో తోడుగా ఉంటాం..



ఆర్థిక సాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థి

మద్దికెర, మార్చి 17: గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి వరకు కలిసి చదువుకున్నారు. తోటి విద్యార్థికి కష్టమొచ్చిందని తెలుసుకుని సాటి పూర్వ విద్యార్థులు రూ.50వేలు ఆర్థిక సాయం అందజేసి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. ఆదివారం మద్దికెర గ్రామంలోని 1997-98 సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు తమ మిత్రురాలు సి.హసీనా దీర్ఘకాలిక అనారోగ్యంతో బాధపడుతోందని తెలుసుకుని మిత్రులంతా కలిసి ఆమె యోగక్షేమాలు తెలుసుకోవడమే కాకుండా రూ.50వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు హరినారాయణ, విశ్వనాథ్ మాట్లాడుతూ పదవ తరగతి వరకు కలిసి మెలిసి చదువుకున్నామని, ఆ కుటుంబం ఆరోగ్యస్థితి గతులు బాగా లేకపోవడం వల్ల మిత్రులంతా కలిసి సహాయం అందజేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రాజశేఖర్, పుల్లన్న, బాషా, విమల, చంద్రకళ, సరోజ, వీణా, తదితరులు ఉన్నారు.

'చంద్రబాబే సీఎం కావాలి'

మద్దికెర, మార్చి 17: యువత బంగారు భవిష్యత్తుకు బాటలు పడాలంటే విజన్ ఉన్న నేత నారా చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఉందని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పెరవలి రామాంజనేయులు, మాజీ ఎంపీటీసీ పులిశేఖర్ అన్నారు. ఆదివారం మండలంలోని పెరవలి గ్రామంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ విజయం కోసం ప్రతి కార్యకర్త కష్టపడి పని చేయాలని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చాకలి రాము, వడ్డే రాజేష్, శ్రీరాములు తదితరులు ఉన్నారు.

ముగిసిన బడేసాహెబ్ స్వామి ఉరుసు

గోనెగండ్ల, మార్చి 17: గంజహళ్లి గ్రామంలో వెలసిన బడేసాహెబ్ స్వామి ఉరుసు మహోత్సవం ఆదివారం జియారత్ గంధం తో ఘనంగా ముగిసింది. ఉదయం నుంచి దర్గా పీఠాధిపతులు గంధంతో మేళతాళలతో ఊరేగింపుగా దర్గాను చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్వామి వారి జీవసమాధికి భక్తితో గంధం పట్టించారు. సమాధిని పూలతో అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

వాల్మీకుల ఐక్యతతోనే అభివృద్ధి

ఆదోని టౌన్, మార్చి 17 : వాల్మీకుల ఐక్యతతోనే అభివృద్ధికి అవకాశం ఉంటుందని దక్షిణ భారత్ వాల్మీకి మహర్షి ట్రస్ట్ (బెంగళూరు) చైర్మన్ బీ రంగనాయకులు అన్నారు. ఆదివారం బాలాజీ నర్సింగ్ హోమ్‌లో వాల్మీకుల ఐక్యతతో కలిగే ప్రయోజనాలు గురించిన పోస్టర్లను డాక్టర్ వై బాలాజీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించాలని చాలాకాలంగా ఉద్యమాలు చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకున్న దాఖలాలు కనిపించకపోవడం ఎంతో శోచనీయమని అన్నారు. వాల్మీకులను ఎస్టీల జాబితాలో చేర్చితే కలిగే ప్రయోజనాలు గురించి ఆయన వివరించారు. కార్యక్రమంలో సలహాదారు శేషయ్య మిల్టన్ వెంకటేష్, ఆంజనేయులు పాల్గొన్నారు.

'అధిష్ఠానం ఆదేశిస్తే పోటీకి సిద్ధం'

ఆదోని టౌన్, మార్చి 17 : పొత్తులో భాగంగా బీజేపీకు కేటాయించిన ఆదోని అసెంబ్లీ నుంచి పోటీ చేయడానికి అధిష్ఠానం తనకు అవకావం కల్పిస్తే కచ్చితంగా గెలుపు తనదేనన్న విశ్వాసం మాజీ ఎమ్మెల్యే, బీజేపీ అన్యభాష రాష్ట్ర కన్వీనర్ ప్రకాశ్ జైన్ వ్యక్తం చేశారు. విజయవాడలోని పార్టీ కార్యాలయంలో బీజేపీ సంఘటన మహామంత్రి మధుకర్‌జీని మర్యాదపూర్వకంగా కలిసి పార్టీ టికెట్‌పై చర్చించినట్లు ఆదివారం ఆయన తెలిపారు. 1983లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో 52.08 శాతం ఓట్లతో ఎమ్మెల్యేగా గెలిచిన తనకు నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలతో సత్సంబంధాలు ఉన్నాయని అన్నారు. అసెంబ్లీ టికెట్ విషయంలో పార్టీ పెద్దలు తన పట్ల సానుకూలంగా స్పందించారని తెలిపారు. పోటీ చేసే అవకాశం అధిష్ఠానం రాజకీయ అనుభవం ఉన్న తనకే ఇస్తుందన్న నమ్మకం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రజాగళం సభకు తరలిన టీడీపీ నాయకులు



ప్రజాగళం సభకు తరలి వెళ్తున్న టీడీపీ నాయకులు

తుగ్గలి, మార్చి 17: టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజాగళం సభకు మండలం నుంచి టీడీపీ నాయకులు తరలివెళ్లారు. ఆదివారం చిలకలూరిపేటలో జరిగే ప్రజాగళం సభకు మండలం నుంచి రాష్ట్ర శాలివాహన కార్పొరేషన్ మాజీ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ బత్తిన వెంకట్రాముడు, మనోహర్ చౌదరి, మండల కన్వీనర్ తిరుపాల్ నాయుడుతో పాటు మండలంలోని అన్ని గ్రామాల టీడీపీ నాయకులు,కార్యకర్తలు వందల సంఖ్యలో సభకు వాహనాల్ల తరలివెళ్లారు. టీడీపీ కూటమితో వచ్చే ఎన్నికల్లో భారీ మెజారిటీతో టీడీపీ కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు కావడం ఖాయమని, రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాల్గవసారి ప్రమాణస్వీకారం చేయడం ఖాయమన్నారు. ఈ సభతో జలగన్న గుండెల్లో రైళ్లు పరుగెడు తాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు లక్ష్మనస్వామి యాదవ్, రవి యాదవ్, వెంకట్రాముడు చౌదరి, సంగాల క్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని వీడి టీడీపీలో చేరిక

మంత్రాలయం, మార్చి 17: మండలంలోని రచ్చుమర్రి గ్రామానికి చెందిన 20 వైసీపీ కుటుంబాలు, కౌతాళం మండలం కరిణి గ్రామానికి చెందిన వైసీపీ నుంచి 50 కుటుంబాలు కలిసి 150 మంది తెలుగుదేశం పార్టీలో చేరారు. ఆదివారం మాధవరం గ్రామంలో టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి రాఘవేంద్రరెడ్డితో కలిసి రఘునాథరెడ్డి, రామక్రిష్ణారెడ్డి వైసీపీ కార్యకర్తలను టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. రచ్చుమర్రికి చెందిన పోలి జొల్లన్న, నరసింహులు, బొజ్జప్ప, రాజన్న, చిన్నబంగారయ్య, పెద్ద నరసింహులు, వడ్ల తిమ్మన్న, రామాంజనేయులుతో పాటు మరి కొంత మంది, కౌతాళం మండలం కరిణి గ్రామానికి తలారి పెద్ద సోమప్ప, చిన్న సోమప్ప, వీరేష్, మహదేవ్, చౌడయ్య, మజ్జిగ రామ్మూర్తి, నాగరాజు, రామాంజి, భీమయ్య, నరసింహ, వీరేంద్ర, రమేష్, అంజినేయ, నీలకంఠ, సంతోష్, వినయ్, మహేష్‌తో పాటు మరికొంత మంది టీడీపీలో చేరారు. జనసేన, టీడీపీ, బీజేపీ కూటమితో టీడీపీ అధికారంలోకి వస్తుందని, సీఎం జగన్ మాయమాటలు చెప్పి మోసం చేశారని పార్టీలో చేరిన కార్యకర్తలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని, అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారిస్తామని పేర్కొన్నారు.



వైసీపీ కార్యకర్తలను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న రాఘవేంద్రరెడ్డి

సమష్టి కృషితోనే గురువైభోత్సవాలు విజయవంతం

● మఠం మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు



మంత్రాలయం, మార్చి 17: ఈ నెల 11 నుంచి 16వ తేదీ వరకు రాఘవేంద్రస్వామి గురు వైభోత్సవాలు శ్రీమఠం అధికారులు, అనధికారులు, గ్రామస్థులు, భక్తుల సహకారంతోనే విజయవంతమయ్యాయని మఠం మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉత్సవాల్లో ముఖ్యమైన రోజులు 12వతేదీన 403వ స్వామివారి పట్టాభిషేకం, 16న రాఘవేంద్రస్వామి 429 పుట్టిన రోజు వేడుకలు మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో ఎంతో కన్నుల పండువగా జరిగాయనీ తెలిపారు. ప్రముఖులకు గురు వైభోత్సవ-2024 అవార్డులు, భరతనాట్యం, దాసవానిసాహిత్యం, పౌరాణిక నాటకాలు భక్తులను ఆకట్టుకున్నాయనీ తెలిపారు. శ్రీమఠంలోని అన్ని సెక్షన్ల అధికారులు, సిబ్బంది, పోలీసు, మీడియా, గ్రామ రెవెన్యూ అధికారులు సమష్టి కృషితోనే విజయవంతమయ్యాయనీ పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఉత్సవాలను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ఆశిస్సులు అందించారని తెలిపారు. ఇలాంటి ఉత్సవాలను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందు రోజుల్లో కూడా జరిగే కార్యక్రమాలను సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు. కృషి చేసిన ప్రతి ఒక్కరికి రాఘవేంద్రస్వామి కృపాకటాక్షం ఉంటుందన్నారు.

ఆర్‌బీకేల్లో అంతా ఆర్భాటమే

● అందుబాటులోకి రాని సేవలు



మద్దికెరలోని ఆర్బీకే కేంద్రం

మద్దికెర, మార్చి 17 : రైతు భరోసా కేంద్రాల సేవలు ఆర్భాటంగానే మిగిలాయి. విత్తనం నుంచి విక్రయం వరకు అన్ని ఆర్‌బీకేల్లోనే సాగుతాయని, ఇది దేశానికి ఆదర్శమని సీఎం జగన్ రెడ్డి ఆ పార్టీ నాయకులు చెబుతున్న మాటలు నీటిమూటలయ్యాయి. ఆర్‌బీకే కేంద్రాల ద్వారా 22 రకాల సేవలు అందించాలని ప్రభుత్వం నిర్దేశించినా క్షేత్రస్థాయిలో ఆచరించడం లేదు. మండలంలోని 11 గ్రామాల్లో ఆయా గ్రామాల్లో 9 ఆర్‌బీకే కేంద్రాలను ఏర్పాటు చేశారు. రైతు బ్యాంకుకు వెళ్లకుండానే బ్యాంకు ప్రతినిధుల ద్వారా ఆర్‌బీకేల్లో సేవలు అందించి ఆన్‌లైన్ సేవలపైన అవగాహన కల్పించాల్సి ఉంది. బ్యాంకు ప్రతినిధులు రోజు ఆర్‌బీకేల్లో కనీసం 2 గంటలు ఉండేలా ప్రణాళికలు రూపొందించారు. వీటికి బ్యాంకులే అవసరమైన సామగ్రి సమకూర్చాల్సి ఉంది. బీసీల ద్వారా రైతులు రూ.10వేల వరకు జమ చేయవచ్చు. రూ.20వేల వరకు తీసుకోవచ్చు. నగదు బదిలీలు రూ.10వేల వరకు పరిమితం చేశారు. ఆర్‌బీకేల్లో బ్యాంకు సేవలకు మార్గదర్శకాలు జిల్లా బ్యాంకర్ల నుంచి వ్యవసాయ శాఖ స్థానిక బ్యాంకర్లు అందినప్పటికీ నేటికి కార్యరూపం దాల్చలేదు. బ్యాంకు సేవలు కాగితాలకే పరిమితమయ్యాయని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఆర్‌బీకేలల్లో అన్ని సేవలు అందుబాటులోకి తేవాలని రైతులు కోరుతున్నారు.

కొనసాగుతున్న నిరసనలు



కాగడాల ప్రదర్శనతో నిరసన తెలుపుతున్న తిక్కారెడ్డి

కౌతాళం, మార్చి 17: మంత్రాలయం తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా తిక్కారెడ్డికే టికెట్ ఇవ్వాలని కోరుతూ నియోజకవర్గంలో నిరసన ప్రదర్శనలు కొనసాగుతూనే ఉన్నాయి. కౌతాళంలో ఆదివారం నాలుగు మండలాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ చేపట్టారు. ఆ పార్టీ కార్యాలయం నుంచి శ్రీకృష్ణావధూత ఆశ్రమం వరకు టీడీపీ జండాలను చేతపట్టి పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నబసప్ప ఆధ్వర్యంలో కార్యకర్తలతో కలసి ర్యాలీ చేపట్టారు. అడివప్పగౌడ్, వెంకటపతిరాజు, కోట్రేష్‌గౌడ్‌లు మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తలకు, నాయకులకు, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ పార్టీ అభివృద్ధికి కార్యకర్తలకు అండగా నిలుస్తూ వస్తున్న నాయకుడు తిక్కారెడ్డి అని పేర్కొన్నారు. అధిష్టానం మరోసారీ పునఃపరిశీలించి తిక్కారెడ్డికే టికెట్ ఇవ్వాలని ఇస్తే అత్యధిక మెజార్టీతో గెలుపించుకుని అసెంబ్లీకి పంపుతామని తెలిపారు. అనంతరం తిక్కారెడ్డి మాట్లాడుతూ అధిష్టాన నిర్ణయంతో రాష్ట్రంలో గెలిచే నాయకులను పార్టీ కోల్పోతుందని ఇలాగే కొనసాగితే పార్టీ మనుగడ కష్టమవుతుందని అన్నారు. ప్రజల ఆశీర్వాదం ఉన్నంత వరకు అసెంబ్లీకి తప్పక పోటీ చేస్తానని స్పష్టం చేశారు. అనంతరం తిక్కారెడ్డికి టికెట్ కేటాయించాలంటూ కాగడాల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్రకార్యదర్శి శ్రీనివాసరెడ్డి, మండల నాయకులు కురుగోడు, రమేష్‌గౌడ్, టిప్పుసుల్తాన్, బాపురం మోహన్‌రెడ్డి, కాశీవిశ్వనాథ, రాజబాబు, రాజానందు ఉన్నారు.

గంజహళ్లి గ్రామంలో గుంతల రోడ్డు



గుంతల మయంగా మారిన ఆర్‌అండ్‌బీ రోడ్డు

గోనెగండ్ల, ఫిబ్రవరి 17: మండల కేంద్రమైన గోనెగండ్ల, గంజహళ్లి ప్రధానరహదారి గుంతమయంగా మరింది. వాహనాల రాక పోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉంది. ఆర్‌అండ్‌బీ అధికారులు రహదారికి మర్మతు చేయాలని గోనెగండ్ల, గంజహళ్లి గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఇక్కడ దాదాపు ఇప్పటికి 20 నుంచి 30 రోడ్డు ప్రమాదాలు జరిగాయని గ్రామస్థులు తెలిపారు. గోనెగండ్ల నుంచి గంజహళ్లికి 10 నిమిషాలలో వెళ్లే ప్రయాణం గుంతల మయం కారణంగా అరగంట పైగానే పడుతుందని వాహనదారులు తెలుపుతున్నారు. రోడ్డు గుంతల మయంగా ఉంటే రోడ్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. కావున సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మర్మమ్మత్తు చేపట్టాలని ఇరు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

మద్దికెర, మార్చి 9: మండల కేంద్రమైన మద్దికెర గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ప్రమాదాలు పొంచి ఉన్నాయి. గ్రామంలోని సిండికేట్ బ్యాంకు, జిల్లా పరిషత్ పాఠశాల, ఊరువాకిలి, ఎస్సీ కాలనీలో విద్యుత్ ట్రాన్స్‌ఫారమ్ కింద ఉండటంతో ఇబ్బందులు పడుతున్నారు. ఊరువాకిలి దగ్గర పశువుల సంచారం ఎక్కువగా తిరుగుతుండటంతో గతంలో పశువులు కూడా విద్యుత్‌షాక్‌కు గురై చనిపోయిన సంఘటనలున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ కింద ఉండటంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని గ్రామస్థులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. జిల్లా పరిషత్ బాలికల పాఠశాలకు వెళ్లే రహదారిలో ఈ ట్రాన్స్‌ఫార్మర్ ఉండటం వల్ల విద్యార్థులు ఆదమరచి దగ్గరికి వెళితే ప్రమాదాల బారిన ప్రమాదం ఉందని గ్రామస్థులు భయాందోళనలు చెందుతున్నారు. విద్యుత్ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫారాలకు కంచె ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



మద్దికెరలో ప్రమాదకరంగా మారిన ట్రాన్స్‌ఫార్మర్

ఎంసెట్ ఉచిత కోచింగ్

ఆదోని (అగ్రికల్చర్), మార్చి 17 : ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా ఎంసెట్ కోచింగ్‌ను ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఇవ్వనున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. ఇంటర్ ఎంపీసీ పూర్తి చేసుకున్న విద్యార్థులు ఈ నెల 21 నుంచి ఏప్రిల్ 23 వరకు పట్టణంలోని విశ్వ నారాయణ జూనియర్ కళాశాలలో కోచింగ్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9052166745, 9515291609 నెంబర్లకు పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



పట్టణంలోని ఎంజీ సర్కిల్‌లో బోల్తాపడిన బొలేరో వాహనం

ఎమ్మిగనూరు, 17: పట్టణంలోని ఎంజీ పెట్రోల్ బంకు సర్కిల్‌లో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు.. మంత్రాలయం వైపు నుంచి మిరపకాయల లోడుతో బోలేరో వాహనం వస్తుండగా పెట్రోలు బంకు వైపునుంచి ఓ ఆటో రావటంతో దాన్ని తప్పించబోయిన బోలేరో అదుపు తప్పి బోల్తా పడగా ఆటోలో ఉన్న ఓ ప్రయాణికుడు తీవ్రంగా గాయపడ్డాడు. అలాగే బోలేరో డ్రైవర్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గాయపడిన వ్యక్తిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బోల్తా పడిన బోలేరో వాహనాన్ని జేసీబీతో పైకి లేపి స్టేషన్‌కు తరలించారు. పట్టణపోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రహదారి పేరుతో అక్రమ వసూళ్లు

ఎమ్మిగనూరు, 17: పట్టణంలోని పశువుల మార్కెట్‌లో రహదారి పేరుతో కాంట్రాక్టర్లు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. వాస్తవంగా రహదారి రుసుము వసూళ్లను మున్సిపాలిటి ఏప్పుడో నిలిపి వేసింది. అయినప్పటికి మార్కెట్ కాంట్రాక్టర్లు తమ దైన శైలిలో ఆదివారం రోజు జరిగే పశువుల సంతలో గుట్టు చప్పుడు కాకుండా పశువులు కొనుగోలు చేసిన వారినుంచి రహదారి రుసుం పేరుతో పశువుకు రూ. 20 ప్రకారం వసూలు చేస్తుండటంతో రైతులు, పశువుల యజమానులు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం మున్సిపల్ అధికారులకు తెలిసినా పట్టించుకోవటం లేదని రైతులు, వ్యాపారులు వాపోయారు.

ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే కేసులు

మంత్రాలయం, మార్చి 17: రాబోవు పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయ పార్టీలు ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే కేసులు తప్పవని మంత్రాలయం ఎస్ఐ గోపినాథ్ అన్నారు. ఆదివారం రాత్రి సూగూరు గ్రామంలో ప్రజలతో ఎన్నికల నియమావళిపై నిబంధనలు వంటి అంశాలపై చర్చించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని రెచ్చగొట్టే ప్రసంగాలు, పార్టీల నాయకుల ఫొటోలు, ఫ్లెక్సీలు, బ్యానర్లు ఉండరాదని తెలిపారు. ఎన్టీఆర్, రాజశేఖర్ రెడ్డి, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ వంటి విగ్రహాలకు ముసుగు వేయాలని పేర్కొన్నారు.

నేడు సద్గురు సుబ్బారుడ స్వాముల రథోత్సవం

కోసిగి, మార్చి 17: మండల కేంద్రమైన కోసిగిలోని రంగప్పగట్టు దగ్గర వెలసిన సద్గురు సుబ్బారుడ స్వామి 61వ రథోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు చంద్రయ్య, బొంబాయి బాబు తెలిపారు. ఉదయం నుంచే మల్లికార్జునస్వామికి, సద్గురు సుబ్బారుడ స్వామికి, లక్ష్మమ్మవ్వకు ప్రత్యేకు పూజలు, మహామంగళహారతులు నిర్వహించి, సాయంత్రం 5 గంటలకు స్వామివారి రథోత్సవాన్ని అశేష జనవాహిని మధ్య ఘనంగా ఊరేగిస్తున్నట్లు తెలిపారు.

గ్రామాల్లో కేంద్రసాయుధ బలగాల కవాతు



కవాతు నిర్వహిస్తున్న కేంద్ర సాయుధ బలగాలు

వెల్దుర్తి, మార్చి, 17: మండలంలో కేంద్ర సాయుధ బలగాలు(ఎస్ఎస్‌బీ) ఆదివారం సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో చెరుకులపాడు, మల్లెపల్లె, బొమ్మిరెడ్డిపల్లె, అల్లుగుండు, రామళ్లకోట, వెల్దుర్తి గ్రామాలలో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌లో సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసిన క్షణం నుండే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందన్నారు. గ్రామాలలో ఎటువంటి అల్లర్లు, ఘర్షణలు అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టంగా తెలియజేసిందన్నారు. ఎవరైనా ఘర్షణలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రాజకీయ పార్టీలు, నాయకులు, ప్రజలందరూ సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.